
సాక్షి
పల్నాడు
గురువారం । 25 । మే । 2023



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 520.70 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 809.70 అడుగుల వద్ద ఉంది.



నిమ్మకాయల ధరలు

తెనాలి : గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1300, గరిష్ట ధర రూ.2,500, మోడల్ ధర రూ.1,800 వరకు పలికింది.

హజ్ యాత్రికులకు టీకాలు తప్పనిసరి



గుంటూరు మెడికల్: హజ్ యాత్రికులు తప్పనిసరిగా వ్యాధినిరోధక టీకాలు వేయించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు తెలిపారు. వివరాల కోసం జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కె.వి.సుబ్బరాజును 9848686364 సంప్రదించాలని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా ఐసెట్

నరసరావుపేట ఈస్ట్: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన ఐసెట్ ప్రవేశ పరీక్ష బుధవారం ప్రశాంతంగా ముగిసింది. నరసరావుపేట కేంద్రంగా నాలుగు ఇంజినీరింగ్ కళాశాలల్లో విద్యార్థులు ఐసెట్‌కు హాజరయ్యారు. ఎంబీఏ, ఎంసీఏ పీజీ కోర్సులలో చేరేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఐసెట్ నిర్వహించారు. నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో 440 మంది విద్యార్థులకు 403మంది, ఎస్‌ఐటీ కళాశాలలో 420 మందికి గాను 380, తిరుమల ఇంజినీరింగ్ కళాశాలలో 360 మందికి 338 మంది, కృష్ణవేణి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో 160 మందికి గాను 149 మంది హాజరయ్యారు.

టీచర్ల క్రమబద్ధీకరణ ప్రక్రియ వాయిదా

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ పాఠశాలల్లో విధులు నిర్వర్తించే అన్ని స్థాయిల ఉపాధ్యాయుల సర్వీసు క్రమబద్ధీకరణ, ప్రొబేషన్ డిక్లరేషన్ ఇప్పటి వరకు చేయించుకోని ఉపాధ్యాయుల సౌకర్యార్థం ఈనెల 30, 31 తేదీల్లో గుంటూరు డీఈఓ కార్యాలయంలో తలపెట్టిన కార్యక్రమం వాయిదా వేసినట్లు డీఈఓ పి.శైలజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బదిలీలు, పదోన్నతుల కారణంగా వాయిదా వేశామని, త్వరలో తదుపరి తేదీని ప్రకటిస్తామని పేర్కొన్నారు.

ఏపీ పాలిసెట్-23 కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

క్రోసూరు: ఏపీ పాలిసెట్ -23 కౌన్సిలింగ్ వివరాల్ని బుధవారం ఎగ్జామ్స్ జిల్లా కో-ఆర్డినేటర్, క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బి.వి.రమాదేవి వివరించారు. మే 25 నుంచి జూన్ 10 వరకు కౌన్సెలింగ్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలన్నారు. ఇందుకు http://appolycet.nic.inను సందర్శించాలని సూచించారు. మే 29 నుంచి జూన్ 5 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్, జూన్ 1 నుంచి జూన్ 6 వరకు వెబ్ ఆప్షన్, జూన్ 7న మార్పులకు అవకాశం ఉందన్నారు. జూన్ 9న సీట్ల కేటాయింపు, జూన్ 15 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాకు సంబంధించి గుంటూరులోని నల్లపాడు , ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, పల్నాడు జిల్లాకు నరసారావుపేటలోని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కాలేజీ, బాపట్ల జిల్లాకు బాపట్లలోని పాలిటెక్నిక్ కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందని వెల్లడించారు. ఇతర వివరాలకు వెబ్‌సైట్ సందర్శించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

ర్యాంకుల వారీగా సర్టిఫికెట్ల పరిశీలన తేదీలు

ఈనెల 29న 1 నుంచి 12,000
30న 12,001 నుంచి 27,000
31న 27,001 నుంచి 43,000
జూన్ 1న 43,001 నుంచి 59,000
జూన్ 2న 59,001 నుంచి 75,000
జూన్ 3న 75,001 నుంచి 92,000
జూన్ 4న 92,001 నుంచి 1,08,000
జూన్ 5న 1,08,001 నుంచి చివరి ర్యాంకు

జిల్లాలో మాతృమరణాల నివారణకు చర్యలు



నరసరావుపేట: జిల్లాలో మాతృమరణాలు చోటుచేసుకోకుండా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి జి.శోభారాణి ఆదేశించారు. స్థానిక పల్నాడు రోడ్డులోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఏప్రిల్‌లో జరిగిన మాతృమరణాలపై డాక్టర్లు, కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశంలో ముత్తుకూరు పీహెచ్‌సీ దుర్గి మండల పరిధిలో జరిగిన మాతృ మరణంపై కమిటీ సభ్యులు, ప్రైవేటు, ప్రభుత్వ వైద్యాధికారుల సమక్షంలో మరణాలకు గల కారణాలను, వాటిని అధిగమించేందుకు భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ హాస్పిటళ్ల పర్యవేక్షణాధికారి డాక్టర్ బీవీ రంగారావు, డెప్యూటీ డీఎండీహెచ్ఓ డాక్టర్ చంద్రశేఖర్, ప్రభుత్వ, ప్రైవేటు డాక్టర్లు మంత్రు నాయక్, పి.సింధుజ, వసంత రాయ్, నాగ పద్మజ, హనుమకుమార్, డీపీహెచ్ఎన్ఓ బి.సురేఖ, ఐసీడీఎస్ పీడీ అరుణ పాల్గొన్నారు.

సెలవుపై గుంటూరు కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి ఈనెల 24 నుంచి జూన్ 7 వరకు సెలవుపై వెళ్లనున్నారు. ఈ మేరకు పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శికి నగర కమిషనర్ సమాచారం అందించారు. గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి లేదా నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పెద్దిరోజాను ఇన్‌చార్జిగా నియమించే అవకాశం ఉన్నట్టు సమాచారం.



గృహప్రవేశం చేసిన లబ్ధిదారుకు నూతన వస్త్రాలను అందజేస్తున్న అతిథులు



టిడ్కో గృహాలను రిబ్బన్‌కట్‌చేసి ప్రారంభిస్తున్న మంత్రి ఆదిమూలపు, ఎమ్మెల్యే గోపిరెడ్డి

'ఇల్లు'విరిసిన ఆనందం

కోటి కాంతులేవో విరిసినట్టు పేదల మోములు చిరునవ్వులతో మెరిశాయి. ఇన్నాళ్లూ గుండెల్లో 'గూడు'కట్టుకున్న భావోద్వేగం కట్టలు తెంచుకున్నట్టు కళ్లు ఆనందబాష్పాలతో తడిశాయి. అంబరమే సంబరమై దిగివచ్చినట్టు.. ఇంటింటా సంతోషాలు వెల్లివిరిశాయి. నరసరావుపేటలో బుధవారం టిడ్కో గృహ సముదాయాల ప్రారంభోత్సవం అంగరంగవైభవంగా జరిగింది. రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్, కలెక్టర్ శివశంకర్ తదితరులు పాల్గొని లబ్ధిదారులకు గృహాలు అప్పగించారు. నూతన వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

- నరసరావుపేట

టిడ్కో గృహాలపై ఎల్లో మీడియా విషప్రచారం

మంత్రి ఆదిమూలపు వెల్లడి

నరసరావుపేట: రాష్ట్రంలోని తమ ప్రభుత్వం 55వేల పైచిలుకు టిడ్కో గృహాలను పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేస్తుంటే ఎల్లో మీడియా విషప్రచారం చేస్తోందని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ విమర్శించారు. బుధవారం నరసరావుపేటలో టిడ్కో గృహసముదాయాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నరసరావుపేటలో కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సారథ్యంలో పూర్తిచేసిన 1,504 గృహాలను ప్రారంభించుకోవటం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 55వేల పైచిలుకు గృహాలను అన్ని వసతులూ సమకూర్చి అందజేస్తున్నట్టు వివరించారు. కాని ఇది ప్రతిపక్షాలు, ఎల్లో మీడియాకు కనపడదని ఎద్దేవా చేశారు. పేదలకు ఇళ్లు దక్కకూడదన్న అక్కసుతో ప్రతిపక్షాలు కోర్టు కేసులతో ఎందుకు అడ్డు తగులుతున్నాయంటూ ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీని కొన్నిపత్రికలు, మీడియా సంస్థలు భుజాన ఎత్తుకొని కోర్టులో కేసులు వేసిన విషయం ప్రస్తావించకుండా టిడ్కో గృహాలు ఇవ్వట్లేదని ప్రచారం చేస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. తాము ఎప్పుడో పూర్తిచేశామనే టీడీపీ నేతలు ఎందుకు లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు ఇవ్వలేకపోయారని ప్రశ్నించారు. గత ఎన్నికల్లో లబ్ధిపొందాలనే దుర్బుద్ధితో వసతులు కల్పించకుండానే టిడ్కో గృహాలకు ప్రారంభోత్సవాలు చేశారని పేర్కొన్నారు. టీడీపీ నేతల్లా లబ్ధిదారుల నుంచి డబ్బులు లాక్కునే కార్యక్రమాలేమీ తాము చేయలేదని, ఉచితంగా ఒక్క రూపాయికే ఇళ్లు ఇచ్చామని ఆదిమూలపు స్పష్టం చేశారు. ఈఏడాది చివరినాటికి రాష్ట్రవ్యాప్తంగా 2.63లక్షల ఇళ్లను పూర్తి హంగులతో అందజేస్తామని మంత్రి వెల్లడించారు.

రూ.14 కోట్లతో మౌలిక వసతులు కల్పించాం

ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ రూ.14 కోట్లతో మౌలిక వసతులు కల్పించి టిడ్కో ఇళ్లు అందజేస్తున్నామని పేర్కొన్నారు. ప్రక్రియను కోర్టుకు వెళ్లి ఆపాలనే యత్నిస్తున్నారని, అన్నీ అధిగమించి ముందుకెళతామన్నారు. మెయిన్‌రోడ్డు నుంచి టిడ్కో గృహాల వరకు సీసీ రోడ్డు, మధ్యలో కల్వర్టు నిర్మించామన్నారు.



సీఎం సభావేదిక ఏర్పాట్ల పరిశీలన

వెంకటపాలెం(తాడికొండ): తుళ్ళూరు మండలం వెంకటపాలెంలో ఈనెల 26న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా పేదలకు పట్టాల పంపిణీ కార్యక్రమం జరగనున్న నేపథ్యంలో సభావేదిక ఏర్పాట్లను వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, ముఖ్యమంత్రి కార్యక్రమాల కో-ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, బాపట్ల ఎంపీ నందిగం సురేష్, కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ పరిశీలించారు. సభావేదిక, బారికేడ్లు, గ్యాలరీ ఏర్పాట్లపై చర్చించి సూచనలు చేశారు.

పశ్చిమ డెల్టాలో త్వరలో కాల్వల మరమ్మతులు

కృష్ణాపశ్చిమ డివిజన్ ఈఈ మల్లికార్జున



తెనాలి: కృష్ణాపశ్చిమ డెల్టాలో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓ అండ్ ఎం) పనులు కొద్దిరోజుల్లో ప్రారంభమవుతాయని కృష్ణాపశ్చిమ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు మల్లికార్జున తెలిపారు. ఓ అండ్ ఎం ద్వారా డివిజన్‌లో మొత్తం 99 పనులను గుర్తించినట్టు వివరించారు. ఇందుకోసం రూ.6.80 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని పేర్కొన్నారు. ప్రస్తుతం టెండర్లు పిలిచామని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. కృష్ణాపశ్చిమ డెల్టా పరిధిలో 5.71 లక్షల ఎకరాల అయకట్టు ఉన్నట్టు వివరించారు. గతంలో ఈ ఆయకట్టు తెనాలి డివిజన్ పరిధిలోనే ఉండేదని, ప్రస్తుతం కొత్త జిల్లాల ఏర్పాటుతో మూడు జిల్లాల పరిధిలోకి వెళ్లిందని పేర్కొన్నారు. గుంటూరు జిల్లాలో 1.84 లక్షల ఎకరాలు, బాపట్ల జిల్లాలో 3.79 లక్షల ఎకరాలు ఉండగా, ప్రకాశం జిల్లాలో మరో ఏడు వేల ఎకరాల ఆయకట్టు ఉందని వివరించారు. గతేడాది ఖరీఫ్‌లో విస్తృతంగా కురిసిన వర్షాల వల్ల ఆయకట్టుకు నీటి అవసరం కొంతమేర తగ్గిందని చెప్పారు. పశ్చిమడెల్టాకు ఖరీఫ్, రబీలో 69.5 టీఎంసీలను కేటాయించగా, 67 టీఎంసీలే రెండు పంటలకు సరిపోయాయని చెప్పారు. రెండున్నర టీఎంసీల నీరు ఆదా అయిందని పేర్కొన్నారు. ఖరీఫ్‌లో పంట చేతికొచ్చే నవంబరు, డిసెంబరు నెలల్లో తుపాన్ల కారణంగా పంట దెబ్బతి నటాన్ని నివారించేందుకు ప్రభుత్వం నెలరోజులకు ముందుగానే ఖరీఫ్ ఆరంభించేలా చర్యలకు ఉపక్రమించిందని చెప్పారు. ఇందులో భాగంగా గతేడాది ఖరీఫ్ సీజనుకని జూన్ 10నే పంట కాల్వలకు సాగునీటిని విడుదల చేసిందని గుర్తుచేశారు. అదే క్రమంలో ఈ ఏడాది కూడా జూన్ పదో తేదీన నీటి విడుదలకు సమాయత్తమవుతున్నామని వివరించారు. రైతులు తగిన సన్నాహాల్లో ఉండాలని ఆయన సూచించారు.

మాతృదేవో.. ఆరోగ్యమస్తు

అమ్మకు అభయం

- చూలింత నుంచి బాలింత వరకు ఉచిత వైద్య సేవలు
- అమ్మకు ఆసరా పేరిట చికిత్సతోపాటు మందులూ పంపిణీ
- రక్తహీనత నివారణకు పోషకాహారం
- ప్రభుత్వ చర్యలతో 50శాతం తగ్గిన మాతృమరణాలు



వైద్యయోభవ : ప్రభుత్వ ఆస్పత్రిలో ఓ మహిళకు సుఖప్రసవం చేసిన అనంతరం వైద్యసిబ్బంది

గత మూడేళ్లలో మాతృమరణాలు ఇలా..

సంవత్సరం	మాతృమరణాల సంఖ్య
2020-21	25
2021-22	21
2022-23	14

సాక్షి, నరసరావుపేట: గతంలో చూలింత నుంచి బాలింత దశ దాటితే మహిళలకు పునర్జన్మలా భావించేవారు. ఓ బిడ్డకు జన్మనిచ్చే క్రమంలో మాతృమూర్తులు ఎంతో జాగ్రత్తగా ఉండాల్సి వచ్చేది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరైన వైద్య సౌకర్యాలు ముఖ్యంగా గర్భిణులకు అవసరమైన వసతులు ఉండేవికావు. ఈ క్రమంలో చాలా మంది గర్భిణులు కాన్పు సమయంలో కన్నుమూసేవారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వైద్య రంగంపై ప్రత్యేక దృష్టి సారించిన తర్వాత ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది. అమ్మలకు వైద్య అభయం అందింది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఆరోగ్య కేంద్రాల్లో నాడు-నేడులో భాగంగా అనేక వసతులు సమకూర్చారు. ఫలితంగా గర్భనిర్ధారణ మొదలు బాలింత, నవజాత శిశువులకు మెరుగైన వైద్యం అందుతోంది. దీంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

గర్భిణులు, బాలింతలకు నెలనెలా పరీక్షలు

పీహెచ్‌సీ, గ్రామ సచివాలయాల్లో ప్రభుత్వం గర్భనిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేస్తోంది. 2022-23 సంవత్సరంలో పల్నాడు జిల్లాలో 33,695 మంది గర్భిణులు నమోదు అయ్యారు. గర్భిణులకు అవసరమైన ఇతర వైద్య పరీక్షలను నెలనెలా 104 వాహనాల్లో చేస్తున్నారు. సంపూర్ణ పోషణ పథకం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని అందజేస్తున్నారు. సుఖప్రసవమయ్యేలా ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఆస్పత్రుల్లోనూ గర్భిణులకు సుఖప్రసవం చేసేలా ప్రభుత్వం ప్రత్యేకంగా గైనకాలజిస్టులను నియమించింది. ప్రతివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పట్టణ ఆరోగ్యకేంద్రాలలో గైనకాలజిస్టు సేవలను అందుబాటులోకి తెచ్చింది. అల్ట్రా సౌండ్ స్కానింగ్ లాంటి వైద్య పరికరాలను ఆరోగ్య కేంద్రాలకు సమకూర్చింది. ఫలితంగా స్కానింగ్ కోసం గర్భిణులు దూరం వెళ్లాల్సిన అవస్థ తప్పింది. ఎప్పటికప్పుడు శిశువు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునే అవకాశం కలుగుతోంది. పలు రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు, మందులు అన్నీ ఉచితంగా ప్రభుత్వం అందజేస్తోంది. ప్రతి పీహెచ్‌సీలో ప్రసవాలను 24 గంటలు చేయడానికి అవసరమైన ఏర్పాట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రసవం తర్వాత తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా సురక్షితంగా ఉచితంగా ఇంటికి చేరుస్తున్నారు. డాక్టర్ వైఎస్సార్ బేబీ కిట్‌ను అందజేస్తున్నారు. ప్రసవం తర్వాత 42 రోజుల వరకు ఏఎన్ఎంలు గృహ సందర్శన చేసి ఎప్పటికప్పుడు పరీక్షిస్తున్నారు. ఆ తర్వాత నెలనెలా వైద్యపరీక్షలు చేస్తున్నారు.

తగ్గిన మాతృమరణాలు

ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్ల పల్నాడు జిల్లాలో మాతృమరణాల సంఖ్య బాగా తగ్గుముఖం పట్టింది. ముఖ్యంగా హైరిస్క్ ప్రెగ్నెన్సీ ట్రాకింగ్, బర్త్ ప్లాన్, ఎర్లీ మ్యాపింగ్ చర్యలతో మాతృ మరణాల సంఖ్య తగ్గాడానికి వీలవుతోంది. గతంతో పోలిస్తే మాతృమరణాల రేషియో 79 నుంచి 44కు తగ్గింది. ప్రతి లక్ష మంది జనాభా ఆధారంగా ఈ నిష్పత్తిని లెక్కిస్తారు. 2020-21 సంవత్సరంలో 25 మంది మాతృమూర్తులు ప్రసవ సమయంలో మరణించగా, 2022-23 నాటికి అది 14కి తగ్గింది. ప్రభుత్వం తీసుకున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మెరుగైన గైనకాలజీ సేవలు



రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బలోపేతం చేసింది. గర్భిణులకు అవసరమైన అన్ని రకాల వైద్య సేవలు, మందులు అందుబాటులో ఉంచింది. ముఖ్యంగా గైనకాలజిస్టులను నియమించి స్కానింగ్ మిషన్లు సమకూర్చింది. రేడియాలజిస్టులనూ నియమించింది. ఫలితంగా అన్ని రకాల వైద్య సేవలు సత్వరమే అందుతున్నాయి. గర్భిణులు, బాలింతలకు బలమైన పోషకాహారం లభిస్తోంది. దీనివల్లే జిల్లాలో మాతృమరణాలు బాగా తగ్గాయి.

– జి శోభారాణి, డీఎంహెచ్ఓ, పల్నాడు జిల్లా

జగనన్న విద్యాదీవెన వరం



జగనన్న విద్యాదీవెన చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న కలెక్టర్ శివశంకర్

- విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి
- చెక్కు అందజేసిన కలెక్టర్ శివశంకర్
- ఆనందం వ్యక్తం చేసిన లబ్ధిదారులు

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం పేద పిల్లల విద్య కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కలెక్టర్ ఎల్.శివ శంకర్ ఆకాంక్షించారు. 2023 జనవరి-మార్చి త్రైమాసికానికి సంబంధించిన జగనన్న విద్యాదీవెన నిధులను బుధవారం తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్సు ద్వారా నరసరావుపేటలోని కలెక్టరేట్ నుంచి లబ్ధిదారులు వీక్షించారు. అనంతరం కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ జిల్లాలో 31,963 మంది విద్యార్థులకు మేలు జరిగిందని, 28,974 మంది తల్లుల ఖాతాల్లో రూ.32.35 కోట్లు జమయ్యాయని వివరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో ఏమైనా సమస్యలు ఉన్నట్టయితే వారం రోజుల లోపల తన దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. అనంతరం నమూనా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి డి.ఓబులనాయుడు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సామాజిక వర్గాల వారీగా విద్యార్థులకు లబ్ధి ఇలా..


సామాజికవర్గం	విద్యార్థుల సంఖ్య	నిధులు (రూ.కోట్లలో)
ఎస్సీ	176	0.27
ఎస్టీ	2,859	2.32
బీసీ	12,145	10.89
ఈబీసీ	10,090	12.69
ముస్లిం, మైనార్టీ	3,526	3.10
క్రిస్టియన్ మైనార్టీ	137	0.15

ప్రభుత్వానికి పంట నష్ట నివేదిక

- గుంటూరు జిల్లాలో 1,439.80 హెక్టార్లలో నష్టం
- 2,087 మంది రైతులకు రూ.1.35 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ


కొరిటెపాడు(గుంటూరు): ఇటీవల కురిసిన అకాల వర్షాలకు గుంటూరు జిల్లాలోని వివిధ మండలాల్లో 1,439.80 హెక్టార్లలో 33 శాతం కంటే ఎక్కువగా మొక్కజొన్న, జొన్న, వరి పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు నిర్ధారించారు. నాలుగు రోజుల క్రితమే పంట నష్ట నమోదు పూర్తయింది. అనంతరం సామాజిక తనిఖీ కోసం రైతు భరోసా కేంద్రాల్లో జాబితాలను ఉంచారు. సామాజిక తనిఖీ అనంతరం బుధవారం పంట నష్టం వివరాలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు. తెనాలి, దుగ్గిరాల, కొల్లిపర, పొన్నూరు, చేబ్రోలు, కాకుమాను, పెదకాకాని, వట్టిచెరుకూరు, ప్రత్తిపాడు, పెదనందిపాడు, గుంటూరు, మంగళగిరి, తాడేపల్లి మండలాల్లో మొక్కజొన్న, జొన్న, వరి పంటలకు అకాల వర్షాల వల్ల నష్టం వాటిల్లింది. ఇందులో మొక్కజొన్న 642.37 హెక్టార్లలో, జొన్న 790.73 హెక్టార్లలో, వరి 6.70 హెక్టార్లలో దెబ్బతిన్నట్లు అధికారులు నిర్ధారించారు. 2,087 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా రూ.1.35 కోట్ల పరిహారం విడుదల చేయాలని ప్రభుత్వానికి నివేదించారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ కిరణ్‌కుమార్



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ నీలం ప్రభావతిని గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. డాక్టర్ కిరణ్‌కుమార్ ప్రస్తుతం జీజీహెచ్ జనరల్ సర్జరీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. గుంటూరు సంజీవయ్యనగర్‌కు చెందిన ఉపాధ్యాయులు ఏకుల రాజారావు, విజయలక్ష్మి దంపతుల తనయుడు డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ 1986లో గుంటూరు వైద్య కళాశాలలో ఎంబీబీఎస్, 1991లో జనరల్ సర్జరీలో పీజీ వైద్య విద్య పూర్తి చేశారు. జిల్లాలోని గాదెవారిపల్లి, సంగంజాగర్లమూడిలో 1991 డిసెంబరులో మెడికల్ ఆఫీసర్‌గా విధుల్లో చేరి ప్రభుత్వ సర్వీసులోకి ప్రవేశించారు. గుంటూరు వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా 1994లో విధుల్లో చేరి 2004లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2012లో ప్రొఫెసర్‌గా పదోన్నతులు పొందారు. గతంలో విజయవాడ జీజీహెచ్, గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా పనిచేసిన అనుభవం డాక్టర్ కిరణ్‌కుమార్‌కు ఉంది. జీజీహెచ్‌లో పలు అరుదైన శస్త్రచికిత్సలు చేశారు. డాక్టర్ కిరణ్‌కుమార్‌ను సూపరింటెండెంట్‌గా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడడంతో పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

ఎద్దు పొడిచి బాలిక మృతి



ఈపూరు : ఎద్దు పొడిచి బాలిక మృతి చెందిన ఘటన పల్నాడు జిల్లా ఈపూరులో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన ముద్దా కోటేశ్వరరావు, లక్ష్మిల పెద్దకుమార్తె ముద్దా మహేశ్వరి (7) ఇంటివద్ద బజారులో ఆడుకుంటుండగా అటుగా వెళ్తున్న ఎద్దు పొడవడంతో కడుపు భాగంలో తీవ్రంగా గాయమైంది. దీంతో బాలికను చికిత్స కోసం ఈపూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో వినుకొండ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఆలోపే మహేశ్వరి మృతి చెందింది. మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చారు. కోటేశ్వరరావు, లక్ష్మి దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు ఉండగా పెద్దకుమార్తె ఈ ప్రమాదంలో మరణించింది. తల్లి బాలింతగా ఉండి పెద్దకుమార్తె మృతదేహం వద్ద రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది.

జీజీహెచ్ ఉద్యోగాల మెరిట్‌లిస్టు విడుదల

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ డ్రగ్ అండ్ డీ అడిక్షన్ సెంటర్‌లో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న వారి ప్రొవిజనల్ మెరిట్ లిస్టును బుధవారం విడుదల చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి తెలిపారు. మెడికల్ ఆఫీసర్, కౌన్సిలర్, అకౌంటెంట్ కమ్ క్లర్క్ కాంట్రాక్టు పోస్టుల నియామకాలకు దరఖాస్తు చేసుకున్న వారి మెరిట్ లిస్టును గుంటూరు.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 27న సాయంత్రం 5 గంటల్లోపు సూపరింటెండెంట్ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా తగు ఆధారాలతో తెలియజేయాలని సూచించారు.

వైభవంగా ప్రతిష్ఠా మహోత్సవం



కుందురువారిపాలెంలోని ఆలయంలో స్వామి వారికి పూజలు చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

కుందురువారిపాలెం(ముప్పాళ్ళ): గ్రామంలోని శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం వేదపండితుల మంత్రోచ్ఛారణలు, హోమాల మధ్య నూతనంగా నిర్మించిన ఆలయంలో స్వామి విగ్రహాన్ని, ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు భారీ అన్నదానం చేశారు. ప్రతిష్ఠా మహోత్సవంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి ఎస్.వెంకటప్పారెడ్డి పాల్గొన్నారు.

త్వరలో వంద పడకల ఆస్పత్రి

ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల: పట్టణంలోని యాభై పడకల ఆస్పత్రిని త్వరలో వంద పడకల ఆస్పత్రిగా త్వరలోనే మార్పు చేయనున్నట్లు ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. నూతనంగా నిర్మిస్తున్న ఆస్పత్రిని బుధవారం పరిశీలించారు. అనంతరం అధికారులు, వైద్యులతో సమావేశం నిర్వహించారు. పీఆర్కే మాట్లాడుతూ ఇప్పటికే సీఎం దృష్టికి విషయాన్ని తీసుకెళ్లగా తప్పనిసరిగా మాచర్లలో వంద పడకల ఆస్పత్రి ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేశారన్నారు. జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి నిధులు మంజూరుకు కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. పనుల విషయంలో రాజీ పడవద్దని చెప్పారు. వైద్యులంతా అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. వచ్చే నెల రెండో వారం నియోజక వర్గంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చే అవకాశముందని తెలిపారు. ప్రోగ్రాం ఖరారు కాలేదని, ఈలోగా ఆస్పత్రిని అన్ని విధాలుగా తీర్చిదిద్దాలని కోరారు. మాచర్లలోనే అన్నీ వ్యాధులకు సేవలందించాలని కోరారు. ఈ సందర్భంగా కంటి, ఈఎంటీ నూతనంగా చేరిన వైద్యులు ఆపరేషన్ థియేటర్‌కు రూంలు కేటాయించాలని కోరటం, కొత్త బిల్డింగ్‌లోకి షిఫ్ట్



ఆస్పత్రి పరిశీలించి వైద్యులతో చర్చిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

అయిన అనంతరం ప్రస్తుత ఆస్పత్రిలోని రూంలు థియేటర్‌కు ఉపయోగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. 50 పడకల ఆసుపత్రి చిన్న చిన్న పనులుంటే త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆస్పత్రుల అభివృద్ధి వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ రామకోటయ్య, ఆస్పత్రి సూపరింటెండెంట్ కృష్ణమూర్తి, బత్తుల ఏడుకొండలు, కమిటీ సభ్యులు లక్ష్మి, జూలకంటి వీరారెడ్డి పాల్గొన్నారు.

రేపు వేర్వేరు మార్గాల్లో ట్రాఫిక్ మళ్లింపు

వెంకటపాలేనికి సీఎం జగన్ రాక

నగరంపాలెం: తుళ్లూరు మండలం వెంకటపాలెంలో ఈనెల 26న పేదలకు ఉచితంగా ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి హాజరవుతున్న దృష్ట్యా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరణకు ట్రాఫిక్ మళ్లించినట్లు గుంటూరు రేంజ్ ఐజీ కార్యాలయం బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది.

- 26 తెల్లవారుజామున 4 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపు అమలు ఉంటుంది. భారీ వాహనాల హోల్డింగ్ పాయింట్లు ఇలా..
- చెన్నై వైపు నుంచి విజయవాడ మీదుగా విశాఖపట్నం వైపు ఇబ్రహీంపట్నం, నందిగామ వైపునకు వెళ్లే భారీ గూడ్స్ వాహనాలు ఒంగోలు జిల్లా త్రోవగుంట వద్ద నుంచి చీరాల- బాపట్ల -రేపల్లె- అవనిగడ్డ- పామర్రు - గుడివాడ - హనుమాన్ జంక్షన్ మీదుగా విశాఖపట్నం/ ఇబ్రహీంపట్నం వైపునకు మళ్లించారు.
- చెన్నై నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు మేదరమెట్ల, అద్దంకి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ, నార్కెట్‌పల్లి మీదుగా హైదరాబాద్ వెళ్లాలి.
- చిలకలూరిపేట నుంచి విశాఖపట్నం వైపు వెళ్లే వాహనాలను చిలకలూరిపేట నుంచి ఎన్‌హెచ్– 16 మీదుగా పెదనందిపాడు, కాకుమాను, పొన్నూరు, చందోలు, చెరుకుపల్లి , భట్టిప్రోలు, పెనుమూడి బ్రిడ్జి మీదుగా అవనిగడ్డ, పామర్రు - గుడివాడ - హనుమాన్ జంక్షన్ మీదుగా విశాఖపట్నం వైపు మళ్లించారు.
- చెన్నై నుంచి విశాఖపట్నం వెళ్లే వాహనాలను బోయపాలెం క్రాస్ వద్ద నుంచి ఉన్నం గ్రామం, ఏ.బి.పాలెం వల్లూరు, పాండ్రపాడు, పొన్నూరు ,చందోలు, చెరుకుపల్లి, భట్టిప్రోలు, పెనుమూడి బ్రిడ్జి మీదగా అవనిగడ్డ, పామర్రు- గుడివాడ - హనుమాన్ జంక్షన్ మీదుగా విశాఖపట్నం వైపు వెళ్లాలి.
- గుంటూరు నుంచి విశాఖపట్నం వెళ్లే వాహనాలను బుడంపాడు మీదుగా తెనాలి, వేమూరు, కొల్లూరు, వెల్లటూరు జంక్షన్, పెనుమూడి బ్రిడ్జి మీదగా అవనిగడ్డ, పామర్రు- గుడివాడ హనుమాన్ జంక్షన్ మీదుగా విశాఖపట్నం వైపు మళ్లించారు.
- విశాఖపట్నం వైపు నుంచి చెన్నై వైపు వెళ్లే లారీలు, భారీ వాహనాలు హనుమాన్ జంక్షన్ వద్ద నుంచి గుడివాడ - పామర్రు- అవనిగడ్డ- రేపల్లె- బాపట్ల - చీరాల- త్రోవగుంట- ఒంగోలు మీదుగా మళ్లించారు.
- రాజమండ్రి నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు దివాన్ చెరువు, ధవళేశ్వరం బ్రిడ్జి, కొవ్వూరు, జంగారెడ్డిగూడెం, అశ్వారావు పేట, సత్తుపల్లి మీదుగా మళ్లించారు.
- విశాఖపట్నం నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే లారీలు, భారీ వాహనాలు హనుమాన్ జంక్షన్ వద్ద నుంచి నూజివీడు– మైలవరం– జి కొండూరు, ఇబ్రహీంపట్నం వైపు మళ్ళించారు.
- గన్నవరం వైపు నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు కేసరపల్లి, ముస్తాబాద్, ఇన్నర్ రింగ్‌రోడ్, పైపులరోడ్, ఇబ్రహింపట్నం వైపునకు మళ్ళించారు.
- హనుమాన్ జంక్షన్ వైపు నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు గన్నవరం గాంధీ బొమ్మ, ఆగిరిపల్లి, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం వైపు మీదుగా వెళ్లాలి.
- భారీ సరుకు రవాణా వాహనాలను గన్నవరం, ఆగిరిపల్లి, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం వైపునకు మళ్లించారు.
- హైదరాబాద్ వైపు నుంచి చెన్నై వైపు వెళ్లే వాహనాలను నార్కెట్‌పల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ళ, అద్దంకి, మేదరమెట్ల మీదుగా చెన్నై వెవెళ్లాలి.
- హైదరాబాద్ వైపు నుంచి విశాఖపట్నం వెళ్లే లారీలు, భారీ వాహనాలు ఇబ్రహీంపట్నం వద్ద నుంచి జి.కొండూరు– మైలవరం– నూజివీడు –హనుమాన్ జంక్షన్ వద్ద నుంచి అనుమతిస్తారు.
- చెన్నై వైపు నుంచి విశాఖపట్నం వైపు వెళ్లే మల్టీ-ఎక్సెల్ గూడ్స్ వాహనాలను ఎటువంటి మళ్లింపు లేకుండా జాతీయ రహదారికి సమీపంలోని చిలకలూరిపేట, ఒంగోలు, నెల్లూరు వద్ద నిలిపివేయనున్నారు. వాటిని సాయంత్రం 4 గంటల తరువాత అనుమతిస్తారు.
- విశాఖపట్నం వైపు నుంచి చెన్నై వైపు వెళ్లే మల్టీ- ఎక్సెల్ గూడ్స్ వాహనాలను హనుమాన్ జంక్షన్ వద్ద, పొట్టిపాటు టోల్ గేట్ వద్ద జాతీయ రహదారికి సమీపంలో నిలిపివేస్తారు. వాటిని కూడా సాయంత్రం 4 గంటలు తరువాత అనుమతిస్తారు.

పెదకాకాని నుంచి వెంకటపాలెం వచ్చే వాహనాల పార్కింగ్ ప్రదేశం వివరాలివే

- తక్కెళ్లపాడు, ఉప్పలపాడు, నంబూరు, అగతరప్పాడు, తక్కెళ్లపాడు వైపు నుంచి వచ్చే వాహనాలు కొప్పురావూరు నుంచి కంతేరు, తాడికొండ, పెదపరిమి, తుళ్లూరు రాయపూడి సీడ్ యాక్సిస్ రోడ్డుకు రావల్సి ఉంది.
- మంగళగిరి టౌన్, కాజా, ఆత్మకూరు, పెదవడ్లపూడి వైపు నుంచి వచ్చే వాహనాలు నిడమర్రు, కురకల్లు, వీఐటీ కాలేజీ జంక్షన్, అసెంబ్లీ వెనుక నుంచి వెలగపూడి చర్చ్ సెంటర్ మీదుగా సీడ్ యాక్సిస్ వైపునకు రావల్సి ఉంటుంది.
- తాడేపల్లి నుంచి వచ్చే వాహనాలు ఎయిమ్స్ ఆస్పత్రి లోపల నుంచి మంగళగిరి బ్రిడ్జి, డాన్‌బాస్కో స్కూల్, ఎర్రబాలెం, కృష్ణాయపాలెం, మందడం మీదుగా వెలగపూడి చర్చి దగ్గర కుడివైపునకు తీసుకొని సీడ్ యాక్సిస్ ఎన్ 9 జంక్షన్‌కు వచ్చి సీడ్ యాక్సిస్ రోడ్డు వైపునకు రావల్సి ఉంది.
- విజయవాడ వైపు నుంచి వచ్చే వాహనాలు ఉండవల్లి, ఉండవల్లి కేవ్స్, పెనుమాక మీదుగా కృష్ణాయపాలెం దాటిన తరువాత కుడి వైపు మెటల్ రోడ్‌లోకి వెళ్లి వెంకటపాలెం పార్కింగ్ ప్రదేశంలోకి చేరాల్సి ఉంటుంది.
- విజయవాడ వైపు నుంచి వచ్చే వాహనాలు విజయవాడ ఎయిమ్స్ పక్కగా బ్రహ్మానందపురం రైల్వే గేటు, నులకపేట మీదుగా ఉండవల్లి సెంటర్, ఉండవల్లి గృహాలు, పెనుమాక, కృష్ణయ్యపాలెం దాటాక కుడివైపునకు తీసుకొని వెంకటపాలెం వాహనాల నిలుపుదల ప్రదేశానికి రావల్సి ఉంటుంది.

రూ.2.50 కోట్లతో వ్యాపారి పరారీ

దాచేపల్లి: నగర పంచాయతీ పరిధిలో ఫర్టిలైజర్ దుకాణం నిర్వహిస్తున్న వ్యాపారి రూ.2.50 కోట్లతో పరార్ అయ్యాడు. బాధితులంతా బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాలు.. మండలంలోని పొందుగలకు చెందిన ఆవుల సైదులు గత కొన్నేళ్లుగా దాచేపల్లిలో శ్రీ లక్ష్మి ట్రేడర్‌ను నడుపుతున్నాడు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను విక్రయించే ఇచ్చేవాడు. ఈ క్రమంలో పంటల నుంచి వచ్చిన లాభాల్లో దుకాణంలో ఉన్న అప్పును చెల్లించగా మిలిగిన నగదును సైదులు వద్ద దాచి పెట్టారు. దీనికి తోడు విత్తనాలు, ఎరువులు సరఫరా చేసే డిస్ట్రిబ్యూటర్ల నుంచి విత్తనాలు, ఎరువులు పెద్దమొత్తంలో తీసుకున్నాడు. దాచేపల్లిలో అద్దెకు ఉంటున్న ఇంట్లో ఉన్న సామగ్రిని స్వగ్రామమైన పొందుగలకు తరలించాడు. సూమారుగా రూ.2.50 కోట్లు సేకరించిన సైదులు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లిపోయాడు. న్యాయం చేయాలని బాధితులంతా పోలీసులను కలసి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తండ్రి, కొడుకుపై పీడీ యాక్ట్

ఇప్పటికే నలుగురిపై..

నగరంపాలెం: జిల్లాలో గంజాయి క్రయ, విక్రయాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. గతనెల 29న శ్రీనివాసరావు పేట వడ్డెరగూడెం వాసి బెల్లంకొండ రాఘవులుపై, ఈనెల 13న దామోదర సంజీవయ్యనగర్‌కు చెందిన మైలా శివవెంకట కిషోర్ అలియాస్ కుక్కల శివపై పీడీ చట్టం నమోదు చేసి జైలుకి తరలించిన విషయం విదితమే. ప్రస్తుతం తండ్రి, కొడుకుపై కూడా పీడీ చట్టం ప్రయోగించడంతో వారి సంఖ్య నలుగురికి చేరింది. వివరాల్లోకి వెళ్తే.. నగరంపాలెం పీఎస్ పరిధిలోని కేవీపీకాలనీ ఒకటో వీధికి చెందిన మందా ఆదాం, డేవిడ్‌లు తండ్రి కొడుకు. వీరిద్దరిపై గుంటూరులోని పలు పీఎస్‌ల్లో గంజాయి విక్రయాల కేసులు ఏడు, క్రిమినల్ కేసుల్లోనూ జైళ్లకు వెళ్లివచ్చారు. ఇక మరణాయుధాలతో స్థానికులను భయభ్రాంతులకు గురిచేయడం, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారు. ప్రభుత్వ / పోలీస్ శాఖ ఆదేశాలను బేఖాతారు చేసేవారు. గంజాయి, మత్తు పదార్థాలు విక్రయించవద్దని పలుమార్లు కౌన్సెలింగ్ చేపట్టినా ఫలితం లేదు. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ఆదేశాల ప్రకారం తండ్రి, కొడుకుపై పీడీ చట్టం నమోదు చేసి, రాజమండ్రి కేంద్ర కారాగారానికి తరలించారు. ప్రజారోగ్యానికి హాని కలిగించే గంజాయి, మత్తుపదార్థాలు విక్రయించే వారిపై ప్రత్యేక దృష్టిసారించినట్లు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ తెలిపారు. జిల్లాలో ప్రశాంతమైన వాతావరణంలో ప్రజలు జీవించేందుకు చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. ప్రజా, శాంతి భద్రతల పరిరక్షణలో రాజీపడే ప్రసక్తిలేదని స్పష్టం చేశారు. జిల్లాలో గంజాయి కేసులు నమోదైన వారు ఇకనైనా జీవితాలను సరిదిద్దుకోవాలని సూచించారు.

వేధిస్తున్నాడని.. ఇంటివారే కొట్టి చంపారు!


ఇద్దరు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

గుంటూరురూరల్: మద్యానికి బానిసై డబ్బుల కోసం వేధిస్తున్న యువకుడిని కుటుంబ సభ్యులే హతమార్చిన కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. గుంటూరు రూరల్ మండలం అడవితక్కెళ్లపాడులోని నల్లపాడు పోలిస్ స్టేషనులో సీఐ శ్రీనివాసరావు కేసు వివరాలను వెల్లడించారు. గుంటూరు రూరల్ మండలం స్వర్ణ భారతి నగర్‌కు చెందిన షేక్ ఫరీద్ (18) మద్యానికి బానిసై డబ్బులు ఇవ్వమని తల్లి, తాతయ్య, అమ్మమ్మలను వేధించడంతో పాటు అడ్డువెళ్లిన వారిపై కూడా విరుచుకుపడుతున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 21వ తేదీ రాత్రి పది గంటల సమయంలో ఫరీద్ డబ్బుల కోసం తల్లి, తాతయ్య, అమ్మమ్మలను విపరీతంగా ఇబ్బంది పెట్టాడు. దీంతో భయాందోళనకు గురైన వారు, స్వర్ణభారతి నగర్ పదిహేనవ లైనులో నివాసం ఉంటున్న చిన్నకుమార్తె ఇంటికి వెళ్లారు. ఫరీద్ అక్కడికి కూడా వెళ్లి నానాయాగీ చేశాడు. దీంతో కుటుంబ సభ్యులైన కారు డ్రైవర్ షేక్ సుభాని, కార్పెంటర్ మహమ్మద్ సల్మాన్‌లు ఫరీద్ గొడవ రోజురోజుకీ ఎక్కువవుతోందని, అతనిని చంపాలని పథక రచన చేశారు. అర్ధరాత్రి సమీపంలో ఫరీద్ ఇంట్లో మద్యం మత్తులో నిద్రిస్తున్న సమయంలో మెడకు నవారు తాడు చుట్టి గట్టిగా బిగించారు. పక్కనే ఉన్న కర్ర తీసుకుని ఫరీద్‌ను సుభాని, సల్మాన్‌లు కొట్టి చంపినట్లు విచారణలో తేలింది. ఈ మేరకు నల్లపాడు సీఐ బత్తుల శ్రీనివాసరావు బుధవారం ఇద్దరు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు.

నిబంధనల ప్రకారమే బదిలీలు, పదోన్నతులు

ఉపాధ్యాయ సంఘాలు సహకరించాలి

నగరంపాలెం: ప్రభుత్వ నిబంధనల ప్రకారం బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా జరుగుతాయని, ఉమ్మడి జిల్లాలోని ఉపాధ్యాయ సంఘాలు సహకరించాలని పాఠశాల విద్య సంయుక్త సంచాలకులు వీఎస్.సుబ్బారావు అన్నారు. గుంటూరు పాతబస్టాండ్ సమీపంలోని పరీక్షా భవన్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏవైనా సమస్యలు ఉన్నట్‌లైతే డీఈఓకు, తమ పరిధిలో పరిష్కారం కాని సమస్యలను ఉన్నతస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. ఉపాధ్యాయ సంఘాలు తీసుకువచ్చిన సమస్యలను తాము పరిష్కరిస్తామని చెప్పారు. డీఈఓ పి.శైలజ మాట్లాడుతూ సీనియారిటీ జాబితాలో ఏవైనా తప్పులు దొర్లితే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఐదేళ్లు పూర్తయిన ప్రధానోపాధ్యాయులు, ఎనిమిదేళ్లు పూర్తయిన



మాట్లాడుతున్న పాఠశాల విద్య సంయుక్త సంచాలకులు సుబ్బారావు

స్కూల్ అసిస్టెంట్‌లు, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు, బదిలీ కావల్సిన ఉపాధ్యాయులు సంబంధిత గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విధంగా కృషి చేయాలన్నారు. ఉమ్మడి జిల్లాలోని డీడీఓలు అందరూ ఉపాధ్యాయులకు అందుబాటులో ఉండాలని చెప్పారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు యిచ్చిన వినతులను పరిష్కరిస్తామని హామీ యిచ్చారు. కార్యక్రమంలో ఉప విద్యాశాఖ అధికారి కె.సుధాకర్‌రెడ్డి, ఉర్దూ ఉప తనిఖీ అధికారి ఎండీ.ఖాసీం, ఎ.ఎస్.ఓ. వి.నాగ మల్లేశ్వరరావు, ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చిన ఘనత జగనన్నదే

- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)
- కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డితో కలసి కృష్ణాయపాలెం లే అవుట్ పరిశీలన

మంగళగిరి: పేదవాడు గొప్పవాడు కావాలని, ఇళ్లులేని ఏ ఒక్క పేదవాడు ఉండకూడదని మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ఉమ్మడి రాష్ట్రంలో పేదలకు 25 లక్షల ఇళ్లను నిర్మిస్తే నేడు ఆయన తనయుడు, సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 33 లక్షల గృహాలను నిర్మించడం ఎంతో గొప్ప విషయమని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అన్నారు. సీఆర్‌డీఏ పరిధిలోని కృష్ణాయపాలెం లేఅవుట్‌లో పూర్తయిన అభివృద్ధి పనులను బుధవారం ఎమ్మెల్యే ఆర్కే జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్‌రెడ్డితో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ దశాబ్దాల నాటి పేదల కల తీర్చిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని, 1450 ఎకరాల్లో 55 వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడం ఎంతో గొప్ప విషయమన్నారు. అందులో భాగంగా మంగళగిరి నియోజకవర్గానికి సంబంధించి సుమారు 650 ఎకరాల్లో 23 వేల మంది స్థానిక పేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వడం అభినందనీయమన్నారు. పేదవారు, తక్కువ కులం వారు రాజధాని ప్రాంతంలో ఉండకూడదనే దురుద్దేశ్యంతో చంద్రబాబు రైతుల పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు, తన బినామీలతో కోర్టుల్లో అన్యాయంగా వ్యాజ్యాలు వేయించారని గుర్తు చేశారు. చంద్రబాబు ఎక్కడైతే పేదవాడు ఉండకూడదని కోరుకున్నాడో అక్కడే ఆ దేవుడు, గౌరవ న్యాయస్థానాలు, సీఎం జగన్ మోహన్‌రెడ్డి కోరికతో పాటు పేదవాడి కల తీరేవిధంగా ఇళ్ల పట్టాలను కేటాయించడం జరిగిందన్నారు. ఈనెల 26వ తేదీన సీఎం జగన్ మోహనరెడ్డి చేతుల మీదుగా ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం అనంతరం దీపావళి పండుగ నాటికి లే అవుట్లలో పేదల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని కోరనున్నట్లు ఎమ్మెల్యే ఆర్కే తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర కమిషనర్ యు.శారదాదేవి, డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్ పాల్గొన్నారు.



కృష్ణాయపాలెం లేఅవుట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆర్కే

ఎస్సీలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న చంద్రబాబు

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందా కృష్ణ మాదిగ

పాత గుంటూరు: రాష్ట్రంలో ఎస్సీలకు వ్యతిరేకంగా చంద్రబాబు వ్యవహరిస్తున్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందా కృష్ణ మాదిగ ఆరోపించారు. గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో బుధవారం ఎమ్మార్పీఎస్, ఎంపీఎస్ ఆధ్వర్యంలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ లక్ష్య సాధన కోసం ఉమ్మడి జిల్లా సదస్సు నిర్వహించారు. సభకు మందా కృష్ణ మాదిగ అధ్యక్షత వహించి మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో మొదలుపెట్టిన వర్గీకరణ ఉద్యమం గత 29 ఏళ్లుగా కొనసాగుతోందన్నారు. 2014లో చంద్రబాబు సహకరిస్తానని హామీ ఇచ్చి, తనను గెలిపిస్తే ఎస్సీల రుణం తీర్చుకుంటానని తెలిపారన్నారు. అధికారంలోకి వచ్చాక మాటమార్చి ఎస్సీలకు అన్యాయం చేశారని మండిపడ్డారు. అప్పటి నుంచి చంద్రబాబు ఎస్సీలపై నిర్బంధం ప్రకటించి, 2018లో ఏఎన్‌యూ వద్ద కురుక్షేత్రం సభ నిర్వహణకు అనుమతి ఇవ్వకుండా అడ్డుకున్నాడని దుయ్యబట్టారు. ఎస్సీల ఆగ్రహానికి గురైన చంద్రబాబుకు 2019 ఎన్నికల్లో వారు తగిన బుద్ధి చెప్పారని తెలిపారు. దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో కేంద్రం దృష్టికి వర్గీకరణ అంశాన్ని తీసుకువెళ్లి పూర్తిస్థాయిలో సహకారం అందించారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి సుదీర్ఘంగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణ అంశాన్ని కేంద్రంలో ప్రస్తావించి పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా సమన్వయకర్తలు కూచిపూడి సత్యం మాదిగ, వేమూరి సుధీర్ మాదిగ, ఎంఈఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వంగూరి అశోక్ మాదిగ, పలువురు నాయకులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న మందా కృష్ణ మాదిగ

మందా కృష్ణపై పెద్దిరెడ్డి వ్యాఖ్యల్లో తప్పేముంది?

మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు

తాడేపల్లిరూరల్ : ప్రతి ఎన్నికల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా మందా కృష్ణ మాదిగ చంద్రబాబుకు సపోర్టు చేస్తున్నారని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనడంలో తప్పేముందని మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు అన్నారు. తాడేపల్లిలోని ఆయన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై మందా కృష్ణ మాదిగ అనుచరులు అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. తెలంగాణ ఉద్యమ కాలంలో మందా కృష్ణ ఆంధ్రావాళ్లను రాళ్లతో కొట్టండి అని చేసిన వ్యాఖ్యలు నిజం కాదా ? అని ప్రశ్నించారు. వర్గీకరణ సెంటిమెంటును అడ్డం పెట్టుకుని 29 సంవత్సరాలుగా మాదిగల్ని ఆయన మోసం చేశారని తెలిపారు. వ్యక్తిగత లబ్ధి తప్పా మాదిగలకు చేసిందేమీ లేదని విమర్శించారు. ఎమ్మార్పీస్ ఉద్యమంలో 40 మంది అసువులు బాస్తే వెలుగులో మందకృష్ణ మాత్రమే ఉన్నారని చెప్పారు. తమను చంద్రబాబు, మందా కృష్ణ మోసం చేస్తున్నారన్న విషయం అమాయకపు మాదిగలు గ్రహించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఆంధ్రాలో ఎంపీ, ఎమ్మెల్సీ, ఇద్దరు మంత్రులు, ఏడుగురు రాష్ట్రస్థాయి చైర్మన్లు ఇవ్వడం ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమైందని కొనియాడారు.